## క్లుప్తంగా

### మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



**తిరువూరు:** సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో వాసవీ క్లబ్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ముఖ్య కూడళ్లలో నగర పంచాయతీ కూడా చలివేంద్రాలు నిర్వహిస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు సముద్రాల కిరణ్‌కుమార్, వాసవీ వనిత అధ్యక్షురాలు పుష్పవాణి, సీనియర్ సభ్యులు కొత్తగుండ్ల ప్రసాదరావు, దేవిశెట్టి బాలకృష్ణ, జూలూరు రమణయ్య, నాగుబండి ప్రకాశరావు, నాళ్ళా సూర్యప్రకాశరావు, గుర్రం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పద్మశాలీయ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**మైలవరం:** భద్రావతి సమేత భావనా ఋషి స్వామి వారి దేవస్థానంలో పద్మశాలీయ సేవా సంఘం–2025 నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ద్వారకా తిరుమల దేవస్థానం, ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్‌గా శ్రీ రాజా వెంకట సుధాకరరావు పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పద్మశాలీయ సేవా సంఘం మండల అధ్యక్షులుగా దునకా ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా తాటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మా సురేష్‌బాబు, కోశాధికారిగా మసనం సుధాకరరావు, ఉప కార్యదర్శిగా బూదాటి జగదీష్, సహాయ కార్యదర్శులుగా ఉడతా వెంకట కృష్ణారావు, గణపవరపు పెరుమాళ్లు, అవ్వారు శ్రీనివాసరావు, పెండెం వెంకట్ దుర్గారావు, గౌరవ అధ్యక్షులుగా గణపవరపు విష్ణువర్ధనరావు, తాటి తులసీరావు, దునకా రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా పులిపాటి శ్రీనివాసరావు, ఉగిరి పరుశురామ్, చిట్యాల శ్రీనివాసరావు, పెండెం శ్రీనివాసరావు, మేలిమి శివాంజనేయులు ఎన్నికయ్యారు.

### నిత్యాన్నదానానికి విరాళం



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గ్రామానికి చెందిన కనపర్తి వెంకటరమణ కుటుంబ సభ్యులు రూ. 51 వేలు విరాళాన్ని మంగళవారం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను శాలువా, పూలమాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

### మొక్కల పెంపకంపై అవగాహన

**నందిగామ టౌన్:** మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని పర్యావరణ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్‌ను ఆయన నివాసంలో మంగళవారం జేడీ లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వం కూడా నర్సరీలు, వివిధ సంస్థల ద్వారా మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వుకోవడం వల్ల భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపా రవీంద్రనాథ్, వాసిరెడ్డి వంశీ తదితరులు పాల్గొన్నారు.

### మైలవరంలో బైక్ దొంగ అరెస్ట్

**మైలవరం:** మైలవరం మండలంలో ద్విచక్ర వాహన దొంగను అరెస్టు చేశామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మైలవరంలో గత ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయని కొంతకాలంగా ఫిర్యాదులు అందుతుండటంతో నిఘా పెట్టామన్నారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద దొంగిలించబడిన నాలుగు ద్విచక్రవాహనాలు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

# పచ్చదనం..ప్రతిపాదనలకే పరిమితం



అభివృద్ధికి నోచని తిరువూరు శివారులోని దేవసముద్రం చెరువు



ఉద్యానవనం ఏర్పాటుకు ప్రతిపాదించిన మునుకుళ్ల రోడ్డులోని పోతుల చెరువు

- మొక్కల పెంపకానికి మీనమేషాలు
- పెండింగ్‌లో రూ.60 లక్షలతో ట్యాంక్‌బండ్‌ల ఏర్పాటు పనులు
- ఉద్యానవనాలు లేని తిరువూరు

**తిరువూరు:** తిరువూరు పట్టణంలో సుమారు 50వేల జనాభా నివశిస్తున్నారు. అయినా ఇక్కడ పచ్చదనం పెంపునకు నగర పంచాయతీ చేస్తున్న చర్యలు ఫలించడం లేదు. గతంలో ఉన్న పొట్టిశ్రీరాములు పార్కును పిల్లల పార్కుగా మార్పు చేసినప్పటికీ అక్కడ మచ్చుకైనా మొక్క నాటలేదు. గతంలో ఉన్న చెట్లను సైతం తొలగించి క్రీడా వస్తువులను ఏర్పాటు చేసి నగర పంచాయతీ చేతులు దులుపుకుంది. గత ఏడాది రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా పట్టణంలోని రెండు చెరువుల కట్టలు బలపరిచి ఉద్యాన వనాలుగా అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్లో తీర్మానించినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు.

### చెరువుల అభివృద్ధికి రూ.60 లక్షలతో ప్రతిపాదన..

పట్టణ ప్రజలు సేదదీరేందుకు, వాకర్స్ ట్రాక్ ఏర్పాటుకు మునుకుళ్ల రోడ్డులోని పోతుల చెరువు, పాత తిరువూరులోని దేవసముద్రం చెరువులను నగర పంచాయతీ ఎంపిక చేసి వాటి కట్టలు అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు కౌన్సిల్లో కూడా తీర్మానం చేశారు. నగర పంచాయతీ రూ.60 లక్షలు రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు చెల్లిస్తే ఈ పనులను చేపడతారు. ఇంతవరకు నిధులు చెల్లించకపోవడంతో కార్పొరేషన్ పనులు ప్రారంభించలేదు.

### మొక్కుబడిగా మొక్కల పెంపకం..

పట్టణంలోని మెయిన్ రోడ్డులో బోస్ సెంటరు నుంచి బైపాస్‌రోడ్డు వరకు డివైడర్‌పై మొక్కలు నాటే కార్యక్రమం కూడా మొక్కుబడి తంతుగా ఉంది. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ వాటిని సమూలంగా నిర్మూలించిన అధికారులు వాటి స్థానంలో కొత్తవి నాటలేదు. గతంలో రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కే డివైడర్‌పై మొక్కల పెంపకం బాధ్యతలు అప్పగించి రూ.10 లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం శూన్యం.

### సామాజిక స్థలాలు ఉన్నా..

తిరువూరు పట్టణంలో నగర పంచాయతీకి పలు చోట్ల సామాజిక స్థలాలు ఉన్నా ఉద్యానవనాలు ఏర్పాటు చేయలేకపోతోంది. 9వ వార్డులోని టౌన్‌షిప్‌లో, పాత తిరువూరు, రాజుపేటల్లో కూడా రియల్ ఎస్టేట్ లే అవుట్లలో సామాజిక స్థలాలు నగర పంచాయతీకి అప్పగించినా వాటిలో మొక్కల పెంపకం కూడా చేపట్టలేదు. పచ్చదనం లోపించడంతో పాటు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో సింగరేణి బొగ్గు గనులు ఉండటంతో వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. స్వచ్ఛమైన గాలి కూడా లభ్యం కావట్లేదని వాపోతున్నారు. స్వచ్ఛంద సంస్థలకు ఉద్యానవనాల నిర్వహణ బాధ్యత అప్పగించాలని పలువురు సూచిస్తున్నారు.

### కార్యాచరణ రూపొందించాం



చెరువుల కట్టలు బలపరిచి మొక్కల పెంపకం, వాకర్స్ ట్రాక్ ఏర్పాటుకు రూ.60 లక్షలు రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది. మెయిన్ రోడ్డు డివైడర్‌పై మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం ప్రారంభంలో ఈ కార్యక్రమాలు చేపడతాం.

– లోవరాజు, తిరువూరు నగర పంచాయతీ కమిషనర్

# గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**మాజీ మంత్రి జోగి రమేష్**



జోగి రమేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

**ఇబ్రహీంపట్నం:** వైఎస్సార్ సీపీలో నూతనంగా వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. మైలవరం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకు జోగి రమేష్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు చామల సీతారామరెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గర్నేపూడి వెంకటరావు, పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డిలను జోగి రమేష్ శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రమేష్‌ను దుశ్శాలువాతో సత్కరించి తమ అభిమానం చాటుకున్నారు. జోగి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, తోట తిరుపతిరావు, మాదు రామారావు, సీహెచ్ రవి, స్వామి, బి.శ్రీనివాసరావు, బి.రాజా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన పదో తరగతి పరీక్షలు

**సోషల్ పరీక్షకు 70 మంది గైర్హాజరు**



జి.కొండూరు జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

**నూజివీడు:** గత నెల 17 నుంచి నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని 18 పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షకు 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థులు 3,453 మందికి గాను 70 మంది గైర్హాజరవ్వడంతో 3,383 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. నూజివీడు పట్టణంతో పాటు మండలంలో కలిపి 10 పరీక్ష కేంద్రాల్లో 1,850 మందికి గాను 40 మంది గైర్హాజరు కాగా 1,810 మంది పరీక్షకు హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 440 మందికి గాను ఏడుగురు గైర్హాజరవ్వగా 433 మంది, ముసునూరు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 594 మందికి గాను 14 మంది గైర్హాజరవ్వగా 580 మంది, ఆగిరిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి 569 మందికి గాను తొమ్మిది మంది గైర్హాజరు కాగా 560 మంది పరీక్షలు రాశారు.

- **జి.కొండూరు:** పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా మందస్తు చర్యలు చేపట్టడంతో అన్ని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జి.కొండూరు మండల పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో చివరిరోజు మంగళవారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 649మంది విద్యార్థులకు గానూ 644మంది, నలుగురు ప్రయివేటు విద్యార్థులకు గానూ ఇద్దరు హాజరయ్యారని ఎంఈఓ వీరాస్వామి తెలిపారు.

# ఉపాధి పథకంలో నీటి తొట్టెల నిర్మాణం

**డ్వామా పీడీ అరవపల్లి రాము**



నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రాము, సునీత శర్మ



ఆంజనేయపురంలో నీటితొట్టె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచి కుటుంబరావు

**గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):** వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అరవపల్లి రాము అన్నారు. గుంటుపల్లిలో నిర్మాణం చేపట్టనున్న రెండు నీటి తొట్టెలకు ఎంపీడీఓ సునీత శర్మతో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం జరుపుతున్నామన్నారు. నీటి తొట్టెలు గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి భుక్యా కవిత, ఈఓపీఆర్డీ మనోజ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, పశుసంవర్థక శాఖాధికారులు పాల్గొన్నారు.

**తిరువూరురూరల్:** వేసవిలో పశువులకు తాగునీరందించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని కోకిలంపాడు, ఆంజనేయపురం గ్రామాల్లో తొట్టెల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఆంజనేయపురంలో సర్పంచి మామిడి కుటుంబరావు పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒక్కొక్క నీటితొట్టె నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.30 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయని చెప్పారు. పాడి రైతులు, పశు యజమానులు నీటితొట్టెలను వినియోగించుకోవాలని కోరారు. కోకిలంపాడు సర్పంచి మాధవి, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**విస్సన్నపేట:** మండలంలోని కలగర, రామచంద్రాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ విజయభాస్కర్ తెలిపారు. సబ్‌స్టేషను పరిధిలోని తెల్లదేవరపల్లి, కలగర తదితర గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

### వెలుగు సిబ్బందికి శిక్షణ

**ఆగిరిపల్లి:** వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఏపీఎం రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యులు ఈ ఆర్థిక సంవత్సరంలో వారికి కావాల్సిన ఆర్థిక అవసరాల కోసం వారే ప్రణాళిక తయారు చేసుకునేలా వీఓఏలతో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క వీఓఏకి 8 స్వయం సహాయక సంఘాలను ట్యాగ్ చేసి ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు దివ్య, రజిని, హుస్సేన్వి, వీఓఏలు పాల్గొన్నారు.

### 6 నుంచి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

**నూజివీడు:** గొల్లపల్లిలోని రఘునాథస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ నల్లూరి సతీష్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 6న ఉదయం 9 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేస్తామని, 9న రాత్రి 9 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని చెప్పారు. అనంతరం స్వామి వారికి అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 10న ఊంజల్‌సేవ, హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 11న స్వామి వారి రథోత్సవం, 12న స్వామి వారికి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 13న శేష వాహనంపై గ్రామోత్సవం, 14న రాత్రి 9 గంటలకు స్వామి వారి పవళింపు సేవ జరుగుతుందని వివరించారు.

### సామాజిక పింఛన్ల పంపిణీ

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** గొల్లపూడి రెండో సచివాలయం పరిధిలో మంగళవారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీసీఎల్‌ఏ జిల్లా ప్రత్యేకాధికారి జయలక్ష్మి పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తున్న తీరును ఆమె పరిశీలించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎల్‌డీఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరులో ఔట్ సోర్సింగ్ కార్మికుల ప్రదర్శన





తిరువూరులో ప్రదర్శన చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

**తిరువూరు:** గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఏపీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ తిరువూరులో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. పారుగు సేవలను ఆప్కాస్ నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచించడం తగదని, కార్మికులకు ఉద్యోగ భద్రత కరువై శ్రమ దోపిడీ జరుగుతుందని సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, ఎస్వీ భద్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేటు ఏజెన్సీలలో పనిచేసిన పారుగు సేవల కార్మికులకు సకాలంలో జీతాలు రాక, పనివేళలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. యూనియన్ నాయకులు రమణ, సామ్రాజ్యం, గురవయ్య, నరసారావు దుర్గారావు, వెంకటరమణ, విజయమ్మ, వెంకట కృష్ణ, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



విశ్వబ్రాహ్మణుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

**నందిగామ టౌన్:** విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, మునగంటి కామేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ సమీపంలోని చందాపురం బైపాస్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, చేతి వృత్తిపై ఆధారపడిన వారికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. అన్ని హిందూ ఆలయాల పాలకవర్గంలో ఒకరిని సభ్యుడిగా చేర్చడంతో పాటు విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. కాగా అటుగా వస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విశ్వబ్రాహ్మణుల సంఘం ధర్నాకు మద్దతు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



ఐతవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు చూస్తున్న పీడీ శ్రీలక్ష్మి

**నందిగామ రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఐతవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ముఖ్యంగా ఎత్తు, బరువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం కేంద్రంలోని చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

**విస్సన్నపేట:** మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎంఎస్‌ఎంఈ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి చిన రాట్నాలు తెలిపారు. 2న విస్సన్నపేట ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, 3న పుట్రేల ఎస్‌బీఐ, నరసాపురం, తెల్లదేవరపల్లి కెనరా బ్యాంకుల పరిధిలో ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

### వంటపాత్రలు అందజేత



**చిట్టేల(వత్సవాయి):** చిట్టేల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి మక్కపేట గ్రామానికి చెందిన దారాబోయిన వీరబాబు దంపతులు రూ. 50 వేల విలువ చేసే వంట పాత్రలను మంగళవారం అర్చకులు శివరాంప్రసాద్ శాస్త్రి, సిరికొండ సాయికృష్ణామాచార్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను శాలువా, పూలమాలతో సత్కరించారు.

# ఎక్సైజ్ పాత నేరస్తుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసిన ఎక్సైజ్ పాత నేరస్తులు

**నూజివీడు:** మండలంలో గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన పది మంది పాత నేరస్తులను ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య మంగళవారం నూజివీడు తహసీల్దార్ బీవీ సబ్బారావు ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. పల్లెర్లమూడికి చెందిన బెజవాడ రంగారావు, బెజవాడ రాంబాబు, బొకినాల లక్ష్మీనారాయణ, పాచిగళ్ల డేవిడ్ రాజు, మర్రిబంధంకు చెందిన మురాల వెంకట లక్ష్మి, దారం జోజి, దారం మణి, మురాల సుబ్బారావు, దారం అశ్విని, సిద్ధార్థ నగర్ తండాకు చెందిన భరోతు కోటేశ్వరరావులను బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బైండోవర్ ఏడాది పాటు అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా దీనిని ఉల్లంఘించి ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

**కోర్టుకు నిందితుల హాజరు..**

అలాగే ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్న సిద్ధార్థనగర్ తండాకు చెందిన భరోతు కోటేశ్వరరావు, ఓగిరాల తండాకు చెందిన మూడు కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

# పేదలకు పని కల్పించడమే ఉపాధి హామీ లక్ష్యం

**ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్**



మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్

**నూజివీడు:** పేదలకు పని కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని, గ్రామంలోని పేదలందరూ ఉపాధి హామీ పనులకు రావాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. మండలంలోని సిద్ధార్థ నగర్‌లో ఉపాధిహామీ పథకంపై అవగాహన కల్పించేందుకు గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలోని గిరిజనులు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాను కలిగి ఉంటే వారికి ఏడాదికి 150 రోజులు పని కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ పనికి వచ్చినట్లయితే రోజుకు ఒక క్యూబిక్ మీటర్ పనికిగాను గరిష్ఠంగా రూ.307 నగదును చెల్లిస్తామని చెప్పారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోయినా మేట్‌ల ద్వారా పని కావాలని అడిగితే పేదలకు పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరపాలి



చాట్రాయి సెంటర్లో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు





మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

**చాట్రాయి:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరపాలని కోరుతూ మండల పాస్టర్లు మంగళవారం చాట్రాయి సెంటర్‌లో శాంతి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్‌ను హత్య చేశారని యావత్ క్రైస్తవ సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో నిష్పక్షపాతంగా విచారణ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

**నిష్పక్షపాత విచారణ జరపాలి**

**మైలవరం:** పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాత, పారదర్శకమైన విచారణ జరిపించి, న్యాయం చేయాలని క్రైస్తవ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కోరింది. కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపాలని కోరారు. పాస్టర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 5 లీటర్ల సారా స్వాధీనం

**చాట్రాయి:** జనార్దనవరం గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారని ఎక్సైజ్ ఎస్‌ఐ మస్తానరావు తెలిపారు. ఈ దాడుల్లో బొల్లికొండ చెన్నారావు ఇంటిలో ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.